క్లుప్తంగా

పాశ్వాన్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కేంద్ర మాజీ మంత్రి రాం విలాస్ పాశ్వాన్ వర్ధంతిని బుధవారం బెల్ కాలనీలో రాష్ట్ర జనశక్తి మజ్దూర్ సభ అధ్యక్షుడు సురేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాం విలాస్ పాశ్వాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, గౌస్, సైదయ్య, సురేష్, చారీ, నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేయొద్దు



మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధూరెడ్డి

రామచంద్రాపురం(పటాన్ చెరు): భారతినగర్ డివిజన్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో రోడ్ల పక్కన చెత్త లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సింధూరెడ్డి అన్నారు. బుధవారం భారతినగర్ డివిజన్ వార్డ్ కార్యాలయంలో ఉప కమిషనర్ సురేష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీల్లోని పార్కులలో గ్రీన్ వ్యర్థాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సూచించారు. డివిజన్ పరిధిలోని కాలనల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని కోరారు. అలాగే వాడుకలో లేని మొబైల్ టాయిలెట్స్‌ను తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సురేష్, డీఈ దేవేందర్, నాయకుడు ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానా విధించింది. పట్టణంలోని ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా.. ఐదుగురు పట్టుబడినట్లు చెప్పారు. ఈ మేరకు వారిని బుధవారం జిల్లా కోర్టులో హాజరుపర్చగా ఒకరికి రూ.1000, మరో నలుగురికి రూ.1500 జరిమానా విధించినట్లు తెలిపారు.

పంటల పరిశీలన



పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మునిపల్లి(అందోల్): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి అంజలి తెలిపారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పెద్దలోడి, చీలపల్లి, తాటిపల్లి, పిల్లోడి గ్రామాల్లోని ఆయా రైతుల పత్తి పంటలను పరిశీలించారు. అలాగే దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి సంబంధిత అధికారులకు జాబితాలను పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అంజయ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకోండి

నారాయణఖేడ్: పట్టణంలోని షెట్కార్ సువర్ణ థియేటర్ రోడ్డు సమీపంలోని వక్ఫ్‌బోర్డు భూముల్లో కొంతమంది జేసీబీలతో చదును చేసి చేపడుతున్న షెడ్ల నిర్మాణాలను అధికారులు అడ్డుకోవాలని ఎంఐఎం అధ్యక్షుడు మోహిద్‌పటేల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఆక్రమణ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు భూముల్లో కొంతమంది షెడ్లను ఏర్పాటు చేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎంఐఎం నాయకులు మజార్, అగుకతీబ్, మిస్బా ఉన్నారు.

అధికారులకు ఫిర్యాదు..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు మురుగు కాల్వలు, రోడ్లు ధ్వంసం చేస్తున్నారని బాధితులు బుధవారం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ కౌన్సిలర్ రాములు నేత, కాలనీ వాసులు రియాజ్, యూసూఫ్, కరీం, సర్ఫరాజ్ తదితరులు ఉన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

నారాయణఖేడ్: పట్టణంలోని నెహ్రూ నగర్ సమీపంలో పైపులైన్ లీకేజీ కారణంగా పలు గ్రామాలు, తండాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంపై సబ్ కలెక్టర్ ఉమాహారతికి మాజీ జడ్పీటీసీ రవీందర్ నాయక్ ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక మిషన్ భగీరథ డీఈఈ ఫణివర్మ, గ్రిడ్ ఏఈ సాయికిషోర్ పర్యవేక్షణలో బుధవారం మరమ్మతు పనులు చేపట్టారు.

గ్రామీణ విద్యార్థులకు వరం

- ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు గడువు పెంపు
- ఈనెల 14వ తేదీ వరకు అవకాశం
- ఎంపికైన వారికి ఏడాదికి రూ.12 వేలు

జోగిపేట(అందోల్)/సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ విద్యార్థులకు లబ్ధి చేకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం 2008 నుంచి జాతీయ ఉపకార వేతనాలు అందిస్తుంది. ప్రతి ఏటా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తోంది. ఇందులో భాగంగా ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి గాను రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఒక్కో విద్యార్థికి రూ.48 వేలు ఉపకార వేతనంగా జమ చేస్తోంది. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) పేరిట అందిస్తున్న ఈ ఉపకార వేతనాల దరఖాస్తుకు ప్రభుత్వం గడువు పెంచింది. ఈ మేరకు ఈనెల 14 వరకు పొడిగించగా.. నవంబరు 23న అర్హత పరీక్షను నిర్వహించనుంది.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు..

తొలుత విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం సంబంధిత దరఖాస్తు పత్రాలతోపాటు రెండు సెట్ల నామినల్ రోల్స్, ఎస్‌బీఐ ఫీజు రసీదుతో సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 10 నుంచి 15 వరకు అందజేయాలి. విద్యార్థుల ప్రింటెడ్ దరఖాస్తు, నామినల్ రోల్స్ హెచ్‌ఎం అటాచ్ చేయాలి. ఆ తర్వాత జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి హెచ్‌ఎంలు పంపిన దరఖాస్తులను హైదరాబాద్‌లోని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడి కార్యాలయంలో ఈనెల 16 వరకు అందజేయాలి.



పాఠశాల భవనం

అర్హులు వీళ్లే..

ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. వీరు 7వ తరగతిలో ఎస్సీ, ఎస్టీలు 50 శాతం, ఇతరులు 55 శాతం మార్కులు ఉంటే ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అలాగే తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలి. పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల్లో ఎస్సీ, ఎస్టీలు రూ.50, ఇతరులు రూ.100 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. దరఖాస్తుతో పాటు విద్యార్థులు 7వ తరగతి మార్కుల జాబితా, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్, కులం, ఆదాయ ధృవ పత్రాలు జతచేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో బీఎస్ఈ.టీఈ ఎల్జీఎన్సీఏఎస్ ఏ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువును కేంద్ర ప్రభుత్వం ఈనెల 14వ తేదీ వరకు పొడిగించింది. ఈ పథకానికి ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఎక్కువ మంది విద్యార్థులు పరీక్ష రాసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. విద్యార్థులు బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర సమాచారం తప్పులు లేకుండా దరఖాస్తులో నమోదు చేసుకోవాలి.

– వెంకటేశ్వర్లు, డీఈఓ, సంగారెడ్డి

అయ్యో.. పాపం చిన్నారి

- ప్రాణాలు కాపాడుకునేందుకు తండ్రి ఆరాటం
- దాతలు సహకరించాలని వేడుకోలు



చికిత్స పొందుతున్న హర్షిత

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణ పరిధిలో బీరంగూడ ఎస్ఎస్ఎల్ కాలనీవాసి అరుణ్ కుమార్ రెండో కూతురు హర్షిత ప్రాణాలు కాపాడేందుకు మానవతామూర్తుల సాయం కోరుతున్నారు. ఆయనకు ముగ్గురు పిల్లలు ఉండగా.. రెండో కూతురు 12 ఏళ్ల హర్షిత కీటో డయబెటిస్ వ్యాధితో బాధపడుతూ ఆకస్మాత్తుగా ఆస్పత్రి పాలైంది. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన కూతురికి రోజుకు రూ.రెండు లక్షల వరకు ఖర్చు అవుతుందని వాపోతున్నాడు. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఆయన ఇటీవల ఉద్యోగం కూడ పోయిందని, తన పరిస్థితిని అర్థం చేసుకుని చిన్నారిని కాపాడేందుకు సాయం చేయాలని కోరుతున్నాడు. ప్రస్తుతం ఖాజాగూడలో అంకుర్ ఆస్పత్రిలో చిన్నారి చికిత్స పొందుతుందని, దాతలు నంబర్ 6302322664కు సాయం అందించాలని కోరాడు.

నిరుపేదలకు ఆపన్న హస్తం ‘సీఎంఆర్‌ఎఫ్’

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మంజూరైన ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఆపదకాలంలో మెరుగైన వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన గోనె ఉమారాణి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే ద్వారా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య చికిత్స నిమిత్తం రూ.2.50లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేసింది. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చేతులమీదుగా ఎల్‌ఓసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు కుమార్ గౌడ్, సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకుడు మంద బాల్ రెడ్డి పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి



న్యాల్‌కల్‌లో సమావేశమైన బీజేపీ నాయకులు

జహీరాబాద్ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జహీరాబాద్ పరిశీలకుడు రాజుగౌడ్ అన్నారు. మండల అధ్యక్షుడు దుర్గయ్య అధ్యక్షతన బుధవారం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు విశ్వనాథ్ యాదవ్, చాకలి మోహన్, ప్రభాకర్‌రెడ్డి, అశోక్, నర్సింలు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో సమావేశం

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలను గెలుచుకుంటుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీజేపీ నాయకులు మల్లేష్, శివాజీ పాటిల్, సతీష్ కుమార్, భీమన్న, రాహుల్, మధుసూదన్‌రెడ్డి, ఏక్‌నాథ్‌రావు పాటిల్, ఓంకార్ యాదవ్, అశోక్ పాటిల్, నవీన్, దౌలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల బాలుడి కిడ్నాప్ కలకలం



పవన్ (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): అందోలు మండలంలోని తాడ్ మన్నూర్‌లో కిడ్నాప్ కలకలం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మరాఠా రాజు సోదరి కుమారుడు పవన్ (6)ను బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. 16 నెలల నుంచి పవన్ తాడ్ మన్నూర్‌లో మామతో ఉంటున్నాడు. అయితే సాయంత్రం బాలుడు ఒంటరిగా ఆడుకుంటున్న సమయంలో బైకుపై ఇద్దరు వచ్చి ఎత్తికెళ్లినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. బాలుడి కిడ్నాప్ జరిగన వెంటనే కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రాజు ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి

జహీరాబాద్: పట్టణంలోని ఆర్యనగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న సుజాత(59) బుధవారం గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. ఉదయం పాఠశాలలో ప్రార్థన ముగిసిన అనంతరం విద్యార్థుల అటెండెన్స్ తీసుకుంటున్న సమయంలో తీవ్ర గుండెపోటుకు గురయ్యారు. ఈ సమయంలో తోటి ఉపాధ్యాయులు వెంటనే సీపీఆర్ చేసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్‌లో సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియల్లో ఎంఈఓ మాణయ్య, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారుల విచారణ

నారాయణఖేడ్: మండలంలోని జగన్నాథ్‌పూర్‌లో నెల రోజుల్లో 20 పాడి గేదెలు మృతిపై పశువైద్యాధికారులు బుధవారం విచారణ చేపట్టారు. సంగారెడ్డి ఏడీ పవన్‌కుమార్, ఖేడ్ ఏడీ గంగాధర్, పశువైద్యాధికారి ఆదిత్య వర్మ గ్రామంలోని పశువుల రక్తనమూనాలను సేకరించారు. 14రోజులపాటు గ్రామంలో శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. భారీ వర్షాలతో గడ్డిపై బ్యాక్టీరియా పెరగగా.. ఆ గడ్డిని తిన్న పాడిగేదెలు గొంతు వాచి శ్వాస ఆడక మృతి చెందినట్లు తేల్చారు. గాలికుంటు వ్యాధి బారిన పశువులు పడకుండా వ్యాక్సినేషన్ చేస్తామని వైద్యాధికారులు తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి



అక్రమ నిర్మాణాలను జెసీబీతో కూల్చి వేయిస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఇంద్రేశం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని పీఎస్ఆర్ టౌన్ షిప్‌లో రోడ్డున ఆక్రమించి చేపడుతున్న నిర్మాణాన్ని బుధవారం జెసీబీ సహకారంతో కూల్చివేయించారు. అదే విధంగా అనుమతులకు మించి నిర్మిస్తున్న పనులను సైతం నిలిపివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ నుంచి తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అలాకాకుండా పాత పర్మిషన్ల పేరు చెప్పి ఇష్టారాజ్యంగా నిర్మాణం చేపడితే నోటీసులు జారీ చేసి కూల్చివేతలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

పరిశీలించిన ఆర్డీఓ దేవుజా



నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ, సీఐ

జహీరాబాద్: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 9వ తేదీ నుంచి స్వీకరించనున్న నామినేషన్ల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగానే మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 13 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానం కోసం నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మూడు రోజుల పాటు స్వీకరించనున్న నామినేషన్ల ఏర్పాట్లను ఆర్డీఓ దేవుజా, సీఐ శివలింగం, తహసీల్దార్ దశరథ్‌లు పరిశీలించారు.

కనీస వేతనం అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



మాట్లాడుతున్న సాయిలు

జోగిపేట(అందోల్): ఐకేపీ వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వీఓఏల జిల్లా 4వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందాయన్నారు. కార్మిక హక్కులను కేంద్రం కాలరాస్తుందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించే వరకు కదం తొక్కుతామన్నారు. అలాగే ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకుముందు సీఐటీయూ జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు విద్యాసాగర్, వీఓఏ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, అందోల్ మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లయ్య, ఆంజనేయులు, సభ్యులు అశోక్, గోపాల్, పాహిమ్, లాయక్, లక్ష్మి, కవిత, సునిత, విజయ వాసవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభ్యున్నతికి సహకారం



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నాగిరెడ్డిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవంతో పాటు నీటి ట్యాంక్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ మేరకు న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో గ్రామానికి, విద్యాభివృద్ధికి అండగా నిలుస్తున్న పరిశ్రమ ప్రతినిధులను హెచ్‌ఎం వినోద్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పరిశ్రమ ప్రతినిధులు డీవీ రెడ్డి మాట్లాడుతూ మౌలిక వసతుల అభివృద్ధితోపాటు విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు కృష్ణమోహన్, రవి, శ్రీహర్ష, సీఎస్ఆర్ ప్రతిప్రతినిధి యాదగిరి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు




పస్తాపూర్ చౌరస్తాలో రోడ్డుపై పడిన గుంతలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ చౌరస్తా నుంచి ఝరాసంగంకు వెళ్లే దారిలో కమాన్ వద్ద రోడ్డు మధ్యలో గుంతలు పడ్డాయి. ఏడాది నుంచి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కూడ చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

సింగూరుకు కొనసాగుతున్న వరద

సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఈ మేరకు బుధవారం నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. డ్యాంలోకి 32,923 క్యూసెక్కుల వరద చేరగా.. నాలుగు గేట్ల ద్వారా దిగువకు 34,254 క్యూసెక్కులను వదులుతున్నారు. ప్రాజెక్టులో 17.5 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుతున్నారు.

– పుల్‌కల్(అందోల్)



సింగూరు నీటి పరవళ్లు

బీఆర్‌ఎస్‌పై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జోగిపేట(అందోల్): కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం సరికాదని మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ నారాయణ ఆరోపించారు. బుధవారం అందోలులోని ఒక ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జ్ఞమత్రి రోడ్డు పనులు నేటికీ పూర్తికావడం లేదని విమర్శించారు. కేసీఆర్ చేసిన పనులనే కాంగ్రెస్ నాయకులు చేపడుతున్నారన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావుపై ఆరోపణలు చేసే అర్హత ఎవరికి లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా మేము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ నాగభూషణం, మాజీ ఎంపీపీ చంద్రయ్య, టెక్మాల్, పుల్కల్ మండలాల అధ్యక్షులు వీరప్ప, మాచర్ల విజయ్ కుమార్, సొసైటీ చైర్మన్ యశ్వంత్ రెడ్డి, నాయకులు సాయి కుమార్, లింగా గౌడ్, వెంకటేశం పాల్గొన్నారు.

మైత్రి ఫౌండేషన్‌కు నిలోఫర్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందజేస్తున్న నాగజ్యోతి, విజయ్ కుమార్

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో సామాజిక సేవలతో పేదలకు అండగా నిలుస్తున్న మైత్రి ఫౌండేషన్‌కు నిలోఫర్ ఆస్పత్రి యాజమాన్యం ఎక్సలెన్స్ అవార్డు అందజేశారు. బుధవారం పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్ కుమార్‌కు ఆస్పత్రి సీఎస్ నాగజ్యోతి, సూపరింటెండెంట్ విజయ్ కుమార్‌లు సంయుక్తంగా ఎక్సలెన్స్ అవార్డును అందించి సన్మానించారు. తలసేమియా వ్యాధి గ్రస్తులైన పిల్లలు, గర్భిణులకు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి అందిస్తున్న సేవలను గుర్తించి అవార్డును అందించడంపై ఫౌండేషన్ చైర్మన్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చెత్త సమస్య!

- కంపు కొడుతున్న డంప్ యార్డ్
- ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు



డంప్ యార్డులో పేరుకుపోయిన చెత్త

పటాన్‌చెరు: అమీన్‌పూర్ డంప్ యార్డులో చెత్త పేరుకుపోయింది. సర్వే నంబర్ 993 గుట్టల్లో డంప్ యార్డు ఏర్పాటు చేశారు. అయితే ఈ ప్రాంతంలో డంప్ యార్డు నిర్వహించొద్దని గత కొంతకాలంగా స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయంపై అప్పటి చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి డంప్ యార్డులో చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక చొరవ తీసుకొని జవహర్ నగర్‌కు తరలించేలా ఏర్పాట్లు చేశారు. అయితే ఆ తర్వాత చెత్త కలెక్షన్ సెంటర్‌గా ఉన్న ఈ డంప్ యార్డులో కొన్ని నెలలుగా చెత్తను జవహర్‌నగర్‌కు తరలించడం లేదు. వరుసుగా కురుస్తున్న వర్షాల కారణంగా జవహర్‌నగర్‌లో ఉత్పన్నమైన సమస్యల కారణంగా చెత్త లారీల డంప్ అన్‌లోడ్ కావడం లేదని, ఆ కారణంగానే వినాయక చవితి ఉత్సవాల నుంచి ఇప్పటి వరకు చెత్తను తొలగించలేదు. దీంతో వందలాది లారీల చెత్త పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో డంప్ యార్డులోకి వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో పరిసర ప్రాంతాల వాసులు కంపును భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. కాగా, బుధవారం ఉదయం దాదాపు 6 లారీల చెత్తను జవహర్ నగర్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, తాత్కాలికంగా అమీన్‌పూర్ చెత్త రిక్షాలతో తెచ్చే చెత్తను డంప్ యార్డుకు కాకుండా చందానగర్‌కు తరలించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఉన్నతాధికారుల అనుమతితో ఇక్కడ డంప్‌ను నిలపాలని యోచిస్తున్నారు. అలాచేసినా పేరుకున్న చెత్తను తొలగించేందుకు కనీసం నెల రోజులు పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. చెత్త పేరుకుపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. భరత్‌నగర్, టీచర్స్ కాలనీ, బృందావన్ టీచర్స్ కాలనీ, ప్రణీత్ హోమ్స్, డబుల్ బెడ్ రూమ్ కాలనీ, టైలర్స్, మోడీ కాలనీ వాసులు డంప్ యార్డు కంపుతో ఇబ్బందులు పడుతున్నారు.